వచ్చే నెల 12న 'పోలియో - సబ్ నేషనల్ ఇమ్యూనైజేషన్' డే

సాక్షి,మేడ్చల్ జిల్లా: పోలియో – సబ్ నేషనల్ ఇమ్యూనైజేషన్ డేను అక్టోబర్ 12 (ఆదివారం)న నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డా. సి. ఉమాగౌరి ప్రకటించారు. 0–5 ఏళ్లున్న పిల్లలు, నవజాత శిశువులు సహా, బైవాలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ రెండు చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం హాల్‌లో గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బూత్ డే యాక్టివిటీ కింద పోలియోబూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. అక్టోబర్ 13 నుంచి 15 వరకు ఇంటింటికీ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మల్కాజిగిరి, కీసర డివిజన్ ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్లు గీత, సత్యవతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు చంద్రకళ, శ్రీదేవి, మల్లీశ్వరి, కౌశిక్, మురారి పాల్గొన్నారు.

పంటరుణ మాఫీకి సహకరించాలి


వజ్రేష్‌యాదవ్‌తో రుణమాఫీ సాధన సమితి రైతులు

ఘట్‌కేసర్: రైతు సేవా సహకార సంఘంలో రైతులు తీసుకున్న పంటరుణ మాఫీకి సహకరించాలని రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘంలో 1189 మంది రైతులు పంటరుణం తీసుకున్నారని, ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ఏ ఒక్కరికీ కాలేదని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వంతో చర్చించి రైతుల పంటరుణమాఫీ చేయించేందుకు కృషి చేయాలని ఆయనను కోరారు. ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, బాలరాజుయాదవ్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి, రుణమాఫీ సాధన సమితి అధ్యక్షుడు గౌరీశంకర్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


గౌడవెల్లిలో కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

మేడ్చల్: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆయన కుటుంబసభ్యులతో తిరుమలకు వెళ్లడంతో నాయకులు తమ ప్రాంతాల్లో కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సత్కారం



కీసర: కీసర జిల్లా పరిషత్ స్కూల్‌లో ఉపాధ్యాయుల దినోత్సవం, తెలంగాణ తెలుగు మాతృభాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ, మేడ్చల్ జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్‌గుప్తా హాజరై ఉపాధ్యాయులను సత్కరించారు. కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై వెంకటేష్, ఏఏపీసీ చైర్మన్ జబీనా ఫాతిమా, మాజీ సర్పంచ్ మాధురివెంకటేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం

మహిళా డాక్టర్‌ను మోసం చేసిన వివాహితుడు

అల్వాల్: పెళ్లి చేసుకుంటానని మహిళా డాక్టర్‌ను నమ్మించి రూ.35 లక్షలు కాజేసి, బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్ఎంటీ అల్వాల్‌లో నివాసం ఉండే మహిళా డాక్టర్‌కు గతేడాది ఆన్‌లైన్ ద్వారా పరిచయమైన సంగారెడ్డి, అమీన్‌పూర్‌కు చెందిన ఏఎస్ఆర్ సుబ్రహ్మణ్యం (34) తనకు వివాహం కాలేదని పెళ్లి చేసుకుందామంటూ.. నమ్మించి అవసరాలు ఉన్నాయంటూ చెప్పి పలు దఫాలుగా రూ.25 లక్షలు ఆమె వద్ద తీసుకున్నాడు. దీనితో పాటు డాక్టర్ తల్లికి చెందిన 15 తులాల బంగారం సైతం అతడికి ఇచ్చింది. కాగా కొంతకాలంగా తాము పెళ్లి చేసుకుందామంటూ.. సదరు డాక్టర్ ఒత్తిడి తీసుకురావడంతో అతడు ముఖం చాటేస్తూ.. ఫోన్ నెంబర్ బ్లాక్‌లో పెట్టాడు. అనుమానం రావడంతో అతడి గురించి ఆరా తీయగా.. సుబ్రహ్మణ్యానికి వివాహమై ఇద్దరు సంతానం ఉన్నట్లు తేలింది. ఈ విషయమై ప్రశ్నించగా సోషల్ మీడియాలో పెడతానని, బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనులు పూర్తయ్యేదెన్నడో ?

అధ్వానంగా అంతర్గత రహదారులు

- అసంపూర్తి పనులతో గిర్మాపూర్ వాసుల అవస్థలు
- ఐదేళ్లుగా బస్సు మొఖం చూడని వైనం
- త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి


అసంపూర్తిగా హౌజింగ్ బోర్డు రోడ్డు

మేడ్చల్: పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న గిర్మాపూర్ గ్రామం మేడ్చల్ మున్సిపల్‌లో 9వ వార్డుగా ఉంది. గ్రామంలోనే మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రముఖులకు చెందిన క్రషర్ కంపెనీలు ఉన్నాయి. కేవలం 2 కిలోమీటర్ల దూరంలో 2 వేల జనాభాతో ఉన్న ఈ ప్రాంతానికి ఆర్టీసీ బస్సులు వెళ్లని పరిస్థితి నెలకొంది. నాలుగున్నరేళ్లుగా అసంపూర్తి బ్రిడ్జి, ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణపనుల కారణంగా ప్రజలు ఆర్టీసీ బస్సును చూడని దయనీయ స్థితి ఏర్పడింది.

◆ ఆరేళ్ల క్రితం రైల్వేగేట్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం ప్రారంభ సమయంలో గిర్మాపూర్‌కు బస్సు సౌకర్యం ఉండేది. 2020 ప్రారంభం నుంచి పూర్తిగా రోడ్డును తవ్వేయడంతో గ ఉన్న సౌకర్యం నిలిచిపోయింది.

తవ్వారు.. వదిలేశారు..

రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తై అండర్‌పాస్ నుంచి రాకపోకలు సాగుతున్నా.. పట్టణంలోని జాతీయ రహదారి నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న హౌజింగ్ బోర్డు కాలనీ రోడ్డులో పాతలైన్‌ను తవ్వి రెండునెలలుగానే రోడ్డును మూసివేసి సగం మేర పనులను పూర్తి చేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి.

హౌజింగ్ బోర్డు కాలనీ నుంచి గ్రంథాలయం వరకు కేవలం 200 మీటర్లు మాత్రమే దూరం ఉంది. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయకపోవడం, అసంపూర్తిగా వదిలేయడంతో మేడ్చల్‌వాసులతో పాటు గిర్మాపూర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది మంది ఉపయోగించే హౌజింగ్‌బోర్డు కాలనీ రోడ్డు అసంపూర్తి దశతో కొందరికే ఉపయోగపడుతోంది. త్వరగా రోడ్డు పనులు పూర్తిచేయాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.

ఐదేళ్లుగా బస్సు ముఖం చూడటం లేదు



గిర్మాపూర్ వాసులు ఐదేళ్లుగా ఆర్టీసీ బస్సు సౌకర్యానికి నోచుకోవడం లేదు. అసంపూర్తి రోడ్డు పనుల కారణంగా బస్సు రావడం లేదు. మేడ్చల్ ఆర్టీసీ డిపో అధికారులను గిర్మాపూర్‌కు బస్సులు నడపాలని పలుమార్లు కోరినా బస్సు రావాలంటే రోడ్డు బాగుండాలని చెబుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని పనులు త్వరగా పూర్తి చేయించాలి.

– రాఘవరెడ్డి, గిర్మాపూర్

గిర్మాపూర్ ఎవరికీ పట్టదా..!



స్థానికుల నిర్ణయానికి వ్యతిరేకంగా గిర్మాపూర్‌ను మేడ్చల్ మున్సిపల్‌లో విలీనం చేశారు. గిర్మాపూర్‌ను ఎందుకు పట్టించుకోవడం లేదు..? మండల కేంద్రం నుంచి ఇంటికి వెళ్లడానికి అవస్థలు పడుతున్నా.. మున్సిపల్ అధికారుల్లో కనీసం చలనం లేదు. పాలకవర్గం ఉన్న సమయంలో కౌన్సిలర్ పోరాడినా.. మిగిలిన వారు పట్టించుకోకపోగా.. ప్రత్యేకాధికారుల పాలనలోనూ అధికారులు స్పందించడం లేదు.

– విష్ణుగౌడ్, గిర్మాపూర్

త్వరలోనే రోడ్డు వేయిస్తాం



హౌజింగ్ బోర్డు రోడ్డు నూతన డ్రైనేజీ నిర్మాణం కారణంగా రోడ్డును తవ్వారు. అది కొంతమేర పూర్తైంది. కాంట్రాక్టర్‌తో ఇటీవల మాట్లాడి మిగిలిన రహదారి పనులను పూర్తి చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రస్తుతం డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మట్టిని లేవల్ చేయించి త్వరగా బీటీ లేదా సీసీరోడ్డును వేయిస్తాం.

– చంద్రప్రకాష్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కమిషనర్

చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలి


ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనూ చౌదరి

శామీర్‌పేట్: పోషకాలతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనూ చౌదరి అన్నారు. మంగళవారం తూంకుంట మున్సిపాలిటీ, ఉప్పర్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాలే పౌరుల ఎదుగుదలకు తొలిమెట్టని, ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహారాన్ని గర్భిణీలు, చిన్నారులకు అందించాలని సూచించారు. చిన్నారులకు వచ్చే బాలామృతం, పౌష్టిక సామగ్రి డేట్‌ను పరిశీలించి పంపిణీ చేయాలన్నారు. ఎండ తగలకుండా అంగన్‌వాడీ సెంటర్ ముందు రేకుల షెడ్డు ఏర్పాటు చేయడం వల్ల పిల్లలు ఆడుకుంటారన్నారు. అవసరమైన వసతుల కోసం నివేదిక పంపిస్తే ఏర్పాటు చేస్తామని వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు,

బైక్ చోరీ

పోచారం: ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీకి గురైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో గుండోజి మంజునాథ్ (24) ఆగస్టు 30న తన ఇంటి ముందే రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం బైక్ కనిపించకపోవడంతో పలుచోట్ల వెతకగా.. కనిపించకపోవడంతో బైక్ చోరీ జరిగిందని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు విస్తరణకు స్థల కేటాయింపు అభినందనీయం


ఇంటి యజమానులతో మాట్లాడుతున్న వజ్రేశ్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: ఇతర జిల్లాల బస్సులు పట్టణంలోకి రావడానికి భూ యజమానులు రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలం ఇవ్వడానికి ముందుకురావడం అభినందనీయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ అన్నారు. పట్టణంలో బస్సులు రాకపోకలు సాగించడానికి కాంగ్రెస్ నేతల విజ్ఞప్తి మేరకు మంగళవారం చేపట్టిన కూల్చివేత పనులను బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్‌తో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణలో భూమిని కోల్పోతున్న ఇంటి యజమానులతో మాట్లాడారు. రోడ్డు కోసం స్వచ్ఛందంగా తమ ఇళ్లు కూల్చివేయడానికి స్థలాన్ని ఇవ్వడానికి అంగీకారం తెలపడంతో రోడ్డుకు అడ్డుగా ఉన్న ఇళ్లను జేసీబీ సాయంతో కూల్చివేశామన్నారు. మశ్చేందర్‌రెడ్డి, మల్లేష్, జంగయ్యయాదవ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు రోడ్డు విస్తరణకు ముందుకొచ్చారు.

వ్యక్తి అదృశ్యం


సాయికుమార్

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ మల్లికార్జుననగర్‌లో నివసించే సాయికుమార్ (22) ఓ ప్రైవేట్ స్కూల్‌లో అటెండర్. కాగా భార్య మానసే, కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఈనెల 8న అతడు ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



ఘట్‌కేసర్: 'దుర్వాసనతో అవస్థలు' అనే శీర్షికన 'సాక్షి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. అవుషాపూర్‌లోని సర్వీస్ రోడ్డులో రెండు నెలలుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ రోడ్డుపై పారడంతో అక్కడ కుంటగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ రాజేశ్ పారిశుద్ధ్య కార్మికులతో మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల మాజీ అధికార ప్రతినిధి కవాడి మాధవరెడ్డి పర్యవేక్షించారు. రోడ్డుపై మరోసారి నీరు నిల్వ ఉండకుండా ఉండాలని మట్టి పోయించామని తెలిపారు. రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ మరమ్మతు పనులు పూర్తికావడంతో హర్షం వ్యక్తం చేశారు.

చైన్ స్నాచింగ్

మహిళ పుస్తెల తాడు లాక్కెళ్లిన దుండగుడు

ఘట్‌కేసర్: పొలంలో పనిచేస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన కాంతమ్మ (60), భర్త బుచ్చిరెడ్డితో కలిసి వ్యవసాయ బావి దగ్గరికి వెళ్లింది. భర్త వరి పంటకు మందు చల్లుతుండగా.. ఆమె భర్తకు నీరు అందిస్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగుడు (20–25) వెనక వైపు నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న 6 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లాడు. ఆమె కేకలు వేయడంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. కేకలు విన్న ఆమె భర్త అతడిని వెంబడించాలని రోడ్డు దగ్గరికి వచ్చి చూసేసరికి దుండగుడు పరారయ్యాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే !



సాక్షి,మేడ్చల్ జిల్లా: విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని ఎమ్మెల్సీ ఏవీఎన్ఎస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ హాల్‌లో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి హాజరయ్యారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ.. గురువులు ఎక్కడ గౌరవింపబడతారో అక్కడ ఉత్తమ సమాజానికి రూపకల్పన జరుగుతుందన్నారు. ఏ రంగంలోనైనా ప్రతిభావంతులుగా రాణించాలంటే అందుకు కారణం గురువులేనన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని బయటికి తీసేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. మంచి చెప్పడమే కాకుండా తాము ఆచరిస్తూ.. ఆదర్శంగా నిలవాలన్నారు. విద్యతో పాటు వినయం, సంస్కారం, జ్ఞానాన్ని అందించాలన్నారు.

తెలంగాణ విద్యలో జిల్లాకు ప్రత్యేక స్థానం : రాధికాగుప్తా

రాష్ట్ర స్థాయిలో మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా ప్రత్యేక స్థానంలో ఉందని, అందుకు ఉపాధ్యాయులే కారణమని జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా అన్నారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో సుమారుగా 500కు పైగా స్కూళ్లు ఉన్నాయన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా విద్యారంగంలో విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన 57 మంది ఉత్తమ పురస్కార గ్రహీతలైన ఉపాధ్యాయులను సత్కరించారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయాలి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న అర్చన కాలనీవాసులు

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కిష్టాపూర్ వరకు ప్రధాన రోడ్డులో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కిష్టాపూర్ అర్చన కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం కమిషనర్‌ను కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. వీధిదీపాలు లేక కిష్టాపూర్ రోడ్డు అంధకారంలో ఉంటుందని, దీంతో రాత్రి సమయాల్లో కిష్టాపూర్ రోడ్డులో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని బస్టాండ్ నుంచి కిష్టాపూర్ వరకు వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. జనార్దన్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, మన్మథరావు, హన్మంత్‌రెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



శామీర్‌పేట్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే యూనియన్ కృషి చేస్తుందని టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ అన్నారు. శామీర్‌పేటలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులు 21 మంది పూర్తి చేసిన సభ్యత్వ నమోదు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ.. యూనియన్‌లో సభ్యత్వం నమోదు చేసుకున్న సభ్యులకు ఐడీ కార్డు, జిల్లా డైరీ, భావస్వేచ్ఛ మాసపత్రిక అందజేస్తామన్నారు. అర్హులైన పాత్రికేయులకు అక్రిడియేషన్ కార్డులు, విలేకరుల కుటుంబాలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. జిల్లా కార్యవర్గసభ్యులు నర్సింహారావు, వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు దేశం కృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రవి, మాజీ అధ్యక్షుడు భూపాల్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, ఉపాధ్యక్షుడు శేఖర్, పవన్‌కుమార్, కార్యవర్గసభ్యులు శ్రీహరి, రవీందర్‌గౌడ్, చిన్న, శ్రవణ్‌కుమార్, సభ్యులు రవిగౌడ్, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్లు, సిబ్బంది


మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో..

ప్రజల కోసం పరితపించిన కవితామూర్తి కాళోజీ

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ● మేడ్చల్‌లో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం



జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ప్రదర్శనతో చిన్నారులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజీ అని, ఆయన ఆశయాలు భవిష్యత్‌తరాలకు ఆదర్శమని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌హాల్‌లో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ మాండలీకానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ అన్నారు. 'పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిదే'..! అన్న కాళోజీ మాటలు అందరికీ ఆదర్శమన్నారు. కాళోజీ చిత్రపటానికి కలెక్టర్ మనుచౌదరి, వివిధ శాఖల జిల్లా అధికారులు మీటింగ్‌హాల్‌లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్ఓ హరిప్రియ, వై.దామోదర్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు విజయకుమారి, ఝాన్సీరాణి, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్, కలెక్టరేట్ విభాగంలోని సంబంధిత శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

మేడ్చల్: స్వాతంత్ర్య సమరయోధుడు తెలంగాణ కవి కాళోజీ నారాయణరావు జయంతిని మేడ్చల్‌లో నిర్వహించారు. మంగళవారం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్కూళ్లల్లో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి, సిబ్బంది రాంచందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. కాళోజీ తెలుగుభాష, యాసకు ఎంతో వన్నె తెచ్చారని కొనియాడారు. తెలంగాణ, స్వాతంత్ర్య ఉద్యమాలలో చురుకుగా పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డీఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, మెప్మా సీసీ నర్సింహ, స్థానిక నేతలు, కార్యాలయం సిబ్బంది, స్నేహ మహిళ సంఘాల మహిళలు పాల్గొన్నారు.


జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో..

రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. తెలుగు వారిగా పుట్టినందుకు గర్వించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ హెచ్ఎం సుశీల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేట్: ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారులు కాళోజీ నారాయణరావు 111వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, అధికారులు నివాళులర్పించారు. మేడ్చల్‌జిల్లా అథారిటీ సభ్యులు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజీ తెలంగాణ సంస్కృతి, భాష, ప్రజాస్వామ్యం, ప్రజల హక్కుల కోసం నిబద్ధతతో కొనసాగిన నాయకుడు అని గుర్తు చేశారు. మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ కన్నేశ్వర్‌రావు, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దమ్మాయిగూడలో కమిషనర్ వెంకట్‌రెడ్డి


కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ అధికారులు